క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తన సొంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రేవేంద్రపాడు వైఎస్సార్ కాలనీ ఏర్పడిన దగ్గర నుంచి రోడ్లు లేకపోవడంతో మొట్టమొదటి సారిగా ఆ ప్రాంతంలోని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన రోడ్డు ఆక్రమణలు తొలగించి గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే ఆర్కే అగడగగానే రోడ్ల నిర్మాణం చేపట్టినందుకు సర్పంచ్ మేరీరాణితో పాటు స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో మండల పరిధిలోని మోరంపూడి, నల్లమేకలవాని పాలెం, తాడిబోయిన వారిపాలెం, చిలువూరు, మంచికలపూడి గ్రామాల్లో గ్రావెల్ రోడ్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జగనన్న సురక్షతో ఉచితంగాసేవలు



ఫిరంగిపురం: జగనన్న సురక్షతో అర్హులైన ప్రజలకు 11రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్నట్లు ఎంపీడీఓ డి.అనూరాధ తెలిపారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష పథకంపై సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి నిర్వహిస్తున్న పనితీరును అనూరాధ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 11రకాల సేవలు అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా అందేలా చూడాలని చెప్పారు. జనన, మరణ, ఆధార్ మార్పులు, క్యాస్ట్, ఇన్‌కం, పట్టాదారు పాసుపుస్తకం, వ్యవసాయ బీమా పుస్తకం, మ్యారేజ్ సర్టిఫికెటు, రేషన్ స్ప్లిట్టింగ్ వంటివి ఉన్నాయని అవి అవసరమైన వారిచే అప్లికేషన్లు పెట్టించి వారికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఎ.కిషోర్‌బాబు, మధు, ఆనంద్, వలంటీర్లు ఉన్నారు.

ఈదులమూడి అభినందన సభ

తాడేపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజుకు తాడేపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం అభినందనలు తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఈదులమూడి డేవిడ్ రాజును తాడేపల్లి పట్టణ జగనన్న సచివాలయ కన్వీనర్, గృహసారథుల కన్వీనర్‌గా నియమించిన సందర్భంగా తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), వైఎస్సార్‌సీపీ తాడేపల్లి అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు నా మీద నమ్మకం ఉంచి తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్‌గా నియమించారని వారి నమ్మకానికి తగ్గట్టు తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు మేడా వెంకటేశ్వరరావు, తాడేపల్లి ఎస్సీ సెల్ సేవాదళ్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బీసీ సెల్ నాయకులు కుంచాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ దీఈ కృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి బైపాస్ రోడ్ వెంబడి ఎడమ చేతివైపు మణిపాల్ హాస్పిటల్, ఎన్టీఆర్ కరకట్ట వరకు నీలిమా నర్సరీ నుంచి క్రిస్టియన్ పేట బకింగ్‌హామ్ కెనాల్ వరకు మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేషన్ ప్రత్యేక నిధులు రూ.50 లక్షలు కేటాయించి కల్వర్టుల నిర్మాణంతోపాటు డ్రైయినేజీ ఎత్తు పెంచడం, దానిపై సిమెంట్ కాంక్రీట్ ఏర్పాటు చేసే పనులు చేపట్టామని, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయ్యాయని, దాదాపుగా బైపాస్‌రోడ్ వెంబడి ఎడమవైపు భాగంలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు ఆయన తెలిపారు.

2న 'ఆహార వైద్యం' పుస్తకావిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు మేనేజరు సాయి లక్కరాజు తాజా రచన 'ఆహార వైద్యం' పుస్తకావిష్కరణ జులై 2వ తేదీన జరగనుంది. విజయవాడకు చెందిన సాహితీ ప్రచురణలు ముద్రించిన ఈ పుస్తకాన్ని ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆవిష్కరిస్తారు. 'గృహమే వైద్యశాల...వంటింట్లో వస్తువులే మందులు'గా పేర్కొంటూ 'ఆహార వైద్యం' పుస్తక రచన చేశారు. ఎవరికివారు ఇంట్లోనే గృహవైద్యంతో రోగ నిరోధకతను పెంచుకుని పలు వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చనే సాయి భావన. మొత్తం 224 రోగాలకు దినుసులతో ఎలా నయం చేసుకోవచ్చునో ఇందులో సరళమైన భాషలో వివరించారు. 1990లో పాండిచ్చేరిలో హోమియో వైద్యవిద్యను అభ్యసించటం ఉపకరించిందని సాయి చెప్పారు. మన వంటింట్లోని దినుసులను సరైన విధానంలో వాడటం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవచ్చని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- పొన్నెకల్లులో గడప గడపకు మన ప్రభుత్వం
- ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధికి శంకుస్థాపన



పొన్నెకల్లు రాజీవ్ కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కత్తెర సురేష్ కుమార్

పొన్నెకల్లు(తాడికొండ): కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీల శ్మశానవాటికకు కల్వర్టు నిర్మాణం నిమిత్తం జెడ్పీ విడుదల చేసిన రూ.5 లక్షలతో ఆయన శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని సంక్షేమంపై ఆరా తీసిన ఆయన సంబంధిత సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎప్పుడైనా పేదల సంక్షేమం గురించి పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. సంక్షేమం పూర్తిగా పక్కన బెట్టి కేవలం కార్పొరేట్ వ్యవస్థకు రెడ్ కార్పెట్ పరిచిన చంద్రబాబు పేద వర్గాలకు తీరని ద్రోహం చేశాడన్నారు. అన్ని వ్యవస్థల్లో కేవలం తన సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ సామాన్యుడిని పూర్తిగా విస్మరించినందుకే నేడు బాబుకీ దుస్థితి పట్టిందని, అయినా తన తీరు మార్చుకోకుండా పేదల సంక్షేమానికి అడ్డుపడటం ఆయన దుర్మార్గ బుద్ధికి నిదర్శనమన్నారు. అధికారంలో ఉండి పేదలకు ఏమీ చేయని చంద్రబాబు నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి మరోసారి మోసం చేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యకు తెరలేపిన చంద్రబాబు ఏపీలో పేదలను పూర్తిగా అణగదొక్కి ప్రభుత్వ పాఠశాలలను మూసివేత దిశగా తీసుకెళ్లాడన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు చిన్నారులకు ఉచితంగా అమ్మ ఒడి, పుస్తకాలు, దుస్తులు, ఇంగ్లీషు మీడియం విద్య అందిస్తూ పేదలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నాడనడంలో సందేహం లేదన్నారు. పేదలకు ఇంగ్లీషు మీడియం విద్య అందితే ఎక్కడ ఆర్థికంగా సామాజికంగా ఎదిగి ఉన్నతంగా స్థిరపడతారో అనే అక్కసు బాబు గుండెల్లో ఉందని, బాబు ఎన్ని కుయుక్తులు పన్నినా మళ్లీ 50 సంవత్సరాలు జగనన్ననే సీఎంగా చూసుకోవాలని ప్రజలు కలలు కంటున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ నూకతోటి మేరిమ్మ, ఎంపీటీసీ నూతక్కి రాణి, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీలు వలపర్ల కల్పన, బోడపాటి సుశీల, యార్డు మాజీ వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోడపాటి ధర్మరాజు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి బాకి వెంకటస్వామి, మాజీ గ్రామపార్టీ అధ్యక్షుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, నూకతోటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవల్లో అలసత్వం వద్దు

డీఏఓ నున్న వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఏఓ నున్న వెంకటేశ్వర్లు

కొరిటిపాడు (గుంటూరు): రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అలసత్వం వహించ వద్దని, సకాలంలో సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిత్యం రైతులతో ఉంటూ వారికి నాణ్యమైన సేవలు అందించాలన్నారు. స్థానిక కృషీ భవన్‌లో గుంటూరు సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు (వీఏఏ, వీహెచ్‌ఏ) ఖరీఫ్ సన్నద్ధతపై శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ఆరంభం కావడంతో రైతులకు పంట విత్తనాలు, మట్టి పరీక్షలు, పొలంబడులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, ఎక్కడి నుంచి ఫిర్యాదు వచ్చినా సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు వంటి వాటిలో ఏదో ఒక రకాన్ని రైతులు సాగుచేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని సిబ్బంది ఆయా గ్రామాల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎం కిసాన్ డబ్బు రావాలంటే తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) అందజేసి, వారికి బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇప్పించేలా చూడాలని ఆదేశించారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొరత లేకుండా చూడాలని, ఆర్‌బీకేలలో ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయా ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలని, భూసార పరీక్షల ఆధారంగానే రైతులు ఎరువులను వేసుకునేలా చూడాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఈ-క్రాప్ బుకింగ్‌ను తప్పులు లేకుండా చేయాలని సూచించారు. ప్రతి ఆర్‌బీకే సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని, యాక్షన్ ప్లాన్ ప్రకారం రైతులకు సేవలు అందించాలని ఆదేశించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ నల్లా సాంబశివ రావు, డాక్టర్ హైమావతిలు వివిధ పంటల్లో వచ్చే తెగుళ్లు, చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించారు.

బీజేపీ మోసపూరిత ప్రచారాన్ని తిప్పికొట్టండి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

తాడేపల్లిరూరల్: ఉమ్మడి పౌరస్మృతి పేరిట బీజేపీ చేస్తున్న మోసపూరిత ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. శుక్రవారం కొలనుకొండలోని ఐద్వా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతికి ప్రజల మద్దతు భారీగా ఉందని చెప్పి ఏకపక్షంగా చట్టం చేసేందుకు బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ ఇంటింటి ప్రచారం చేస్తూ మోదీ ప్రజలకు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు మద్దుతుగా మిస్డ్ కాల్ చేయిస్తున్నారని, వాస్తవానికి యూనిఫాం సివిల్ కోడ్‌కు మద్దతుగా ఈ మిస్డ్‌కాల్ చేయిస్తున్నారని అన్నారు. జూలై 6వ తేదీలోపు యూనిఫాం సివిల్ కోడ్‌పై అభిప్రాయాలు తెలియజేయమని కేంద్ర ప్రభుత్వం కోరిందని, వాస్తవంగా సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపి చట్టాన్ని రూపొందించాలని అలా కాకుండా విస్తారంగా మద్దతు ఉందని చూపిస్తూ యూనిఫాం సివిల్ కోడ్‌ను రుద్దడం, ఆ పేరుతో వివాదాలను, విద్వేషాలను సృష్టించి మద్దతును కూడగట్టే ఎత్తుగడలో భాగంగా ఈ ఎజెండాను మోడీ తలకెత్తుకున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర మహిళా కమిషన్‌లు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ తప్పుడు పద్ధతులు సరికావని తెలియజెప్పాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు జి.అమలశ్రీ పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్న మహంకాళీ అమ్మవారు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారు ఆదివారం గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆషాఢమాసం రెండవ ఆదివారాన్ని పురస్కరించుకుని మహంకాళీ అమ్మవారిని గాజులతో అలంకరించనున్నామని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

తెనాలిలో అర్బన్ మార్కెట్ ప్రారంభం

తెనాలిఅర్బన్: మెప్మా ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన వస్తువులను విక్రయించుకునేందుకు దీనిని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు రెండు రోజుల చొప్పున మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారని చెప్పారు. అందరూ వీటిని కొనుగోలు చేయాలని కోరారు. ఆమె వెంట మెప్మా తెనాలి సిటీ మేనేజర్‌లు మాధవరావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ హబ్ శిక్షణ దోహదం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ బి శివన్నారాయణ

తాడికొండ: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న స్కిల్ హబ్ శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుందని తుళ్లూరు ఎంపీడీఓ బి శివన్నారాయణ అన్నారు. తుళ్లూరులో నిర్వహించిన ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అనేక శిక్షణా కార్యక్రమాలను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దారా చేపడుతుందని, యువత పెద్దఎత్తున పాల్గొని ఇప్పటికే ఉపాధి పొందడం జరిగింది కనుక అసిస్టెంట్ సర్వేయర్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఉపాధి పొంది మంచిగా స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రణయ్, నాక్ గుంటూరు జిల్లా డైరెక్టర్ వి నరసింహారావు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎ వెంకట్, నాక్ ఇన్‌ఛార్జి ఎ జ్యోతిర్మయి, టి రవి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి



తుళ్లూరు సీఆర్డీయే సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

తాడికొండ: పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు అన్నారు. విద్యుత్ భారం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తుళ్లూరులోని ఏపీసీపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులపై అదనంగా వేస్తున్న మరో 6 రకాల చార్జీలను రద్దు చేయాలన్నారు. ట్రూ అప్ సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని, అదానీ మీటర్లు పెట్టే ప్రతిపాదన నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పేరం బాబురావు, గడ్డం కృష్ణ, కుంభా ఆంజనేయులు, షేక్ జానీ, పొట్లూరి వెంకటేష్, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలి



మాట్లాడుతున్న ఎంపీహెచ్ఎస్ రెహమాన్

ఫిరంగిపురం: కుటుంబంలో ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని నుదురుపాడు ఎంపీహెచ్ఎస్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలో శుక్రవారం మలేరియా మాసోత్సవం ముగింపు సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీహెచ్ఈవో టి.లూర్దురాజు అధ్యక్షత వహించారు. అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చూసుకోవాలని చెప్పారు. మలేరియా వ్యాధి దోమలు కుట్టడం ద్వారా వస్తుందన్నారు. తమ ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కొబ్బరిబొండాలు, పాతటైర్లు వంటి వాటిలో నీరు లేకుండా ఉంచుకోవాలన్నారు. కాలువల్లో నీటిపారుదల సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పొట్టి థెరసమ్మ, హెచ్‌వీ ఖాజాబీ, ఎంఎల్‌హెచ్‌పీలు అమృత, మసూద్, ఏఎన్ఎం లావణ్య, ఎంపీహెచ్ఏ విజయకుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కొండూరులో మలేరియా మాసోత్సవ ర్యాలీ



మలేరియా మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల కంఠంరాజు కొండూరు గ్రామంలో మలేరియా మాసోత్సవాలు ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెనాలి ఇన్‌ఛార్జి అసిస్టెంట్, మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వృద్ధిని నివారించాలని అన్నారు. నీటి నిల్వలు ఉండడం వలన దోమల లార్వాలు వృద్ధి చెందుతాయని, దోమల వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలను పరిశీలించి ఎబేట్ మందు పిచికారీ చేయించారు. అనంతరం మలేరియా మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సందెపోగు సుమంత్, సూపర్‌వైజర్ ఎంబీసీ రాజు, హెల్త్ విజిటర్ రాజ్యం, ఎంఎల్‌హెచ్‌పీ జార్జ్, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యునెస్కోతో కేఎల్‌యూ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, మార్తా ఫెరల్ ఫౌండేషన్ డైరెక్టర్ నందిత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీ యునెస్కోతో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ ఎన్జీఓల సహకారంతో అంతర్జాతీయ స్థాయిలో మార్తా ఫెరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఓయూ అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. మార్తా ఫెరల్ ఫౌండేషన్ డైరెక్టర్ నందితా ప్రధాన్ భట్‌తో కలసి శుక్రవారం సంతకాలు చేసి ఒప్పందపత్రాలను మార్చుకున్నామన్నారు. అనంతరం మహిళా ఫోరం కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న వారికి లింగ ఆధారిత కోర్సులను అందించడంతోపాటు మహిళలకు నాయకత్వం, సత్ ప్రవర్తన పట్ల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు కమ్యూనిటీ ఆధారిత పరిశోధన, శిక్షణ కూడా ఉంటుందని పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి కోనేరు శివకాంచన లత ప్రోత్సాహంతో మహిళా అధ్యాపకులు, విద్యార్థులు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొ చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాధరావు, వైస్ చాన్సలర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకటరామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, విద్యార్థి విభాగ సలహాదారులు కేఆర్ఎస్ ప్రసాద్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, మహిళాభివృద్ధి సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్రావు

ఫిరంగిపురం: రాష్ట్రంలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండా ది వెంకట్రావు అన్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి మండపంలో శుక్రవారం రాత్రి మండల రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి ని పరిష్కరించాలని కోరుతూ జూలై 23న విజయవాడలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో 29వేల 700 మంది రేషన్ డీలర్లు ఉన్నారన్నారు. వారికి వచ్చే కమీషన్ శాతం పెంచాలన్నారు. రేషన్ షాపుల నిర్వహణ ఖర్చులు ప్రభుత్వ చెల్లించాలని, ఇన్స్యూరెన్స్ కమీషన్ చెల్లించాలని, కరోన సమయంలో మృతిచెందిన రేషన్ డీలర్లకు ఆర్థికసాయంగా ఐదు లక్షలు చెల్లించాలని కోరారు. విజయవాడలో నిర్వహించే సభకు ప్రభుత్వం తరుపున ఆయా శాఖ మంత్రి, నాయకులు పాల్గొంటారని వారిదృష్టికి తమ సమస్యలు తీసుకువెళతామని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.గాంధీ, మండల అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శులు పి.కొండారెడ్డి, కోటిరెడ్డి, డీలర్లు వి.బాబురావు, సుబ్బారావు, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రామ దేవతల జాతర



తాడేపల్లి మహాలక్ష్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గ్రామ దేవతల జాతర ఉత్సవాలు శుక్రవారం రైతుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోతురాజుకు నైవేద్యం పెట్టేందుకు మహిళలు ఇంట్లో నుంచి పిండివంటలు వండి సలాం హోటల్ సెంటర్‌లో ఉన్న పోతురాజు గుడిలో రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో పురం సెంటర్ వద్ద ఉన్న మహాలక్ష్మి చెట్టు అయిన వేప, రావి చెట్లకు రైతులు వారి కుటుంబాలతో కలసి వచ్చి నూతన వస్త్రాలను, పసుపు కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం కావడం, వారు పండించే పంటలు బాగా పండాలని గ్రామంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు రాకూడదని ఉత్సవాలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లి రైతులతోపాటు ఎప్పుడూ పూజలు నిర్వహించే బందాపు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వాసు, పక్కన నిందితుడు, సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

మేడికొండూరు: పేరేచర్ల డొంకలో అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పేరేచర్ల డొంకకు చెందిన కోలా భవానీ శంకర్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న 13 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వాసు తెలిపారు. సీఐ వాసు మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల సమాచారాన్ని తెలియజేయాలన్నారు. మద్యం విక్రయం, బెల్టు షాపుల నిర్వహణ చట్టరీత్యా వ్యతిరేకమని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.